క్లుప్తంగా

నేడు రైతులతో ఆర్డీఓ సమావేశం

తాండూరు రూరల్: మండల పరిధిలోని గ్రామాల రైతులతో గురువారం ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నట్లు ఆర్డీఓ శ్రీనివాస్ రావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు తాండూరు తహసీల్దార్ కార్యాలయంలో భూత్పూర్–మన్నెకెళ్లి హైవే(167) భూ నిర్వాసితులు తప్పక హాజరవ్వాలని సూచించారు.

ఎస్ఎస్ఏల నిరసన



పోస్టుకార్డులు చూపుతున్న ఎస్ఎస్ఏ ఉద్యోగులు

కొడంగల్ రూరల్: సమగ్ర శిక్షా అభియాన్‌లో కాంట్రాక్ట్ ఉద్యోగులుగా పనిచేస్తున్న 22వేల మందిని ప్రభుత్వం రెగ్యులరైజ్ చేయాలని సంఘం నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం కస్తూర్బాగాంధీ పాఠశాల ఆవరణలో మధ్యాహ్న భోజన విరామ సమయంలో నిరసనలు చేపట్టారు. ఉద్యోగులను రెగ్యులరైజ్ చేసేవరకు మినిమం టైం స్కేల్ అమలుచేయాలని కోరారు. రాష్ట్ర శాఖ పిలుపు మేరకు భోజన విరామ సమయంలో సీఎం కేసీఆర్, మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు, సబితారెడ్డికి పోస్టు కార్డులు రాసి నిరసన తెలిపారు. గురువారం వంటా వార్పు కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు.

గ్రామాల అభివృద్ధికి పెద్దపీట

ఎంపీపీ అరవింద్‌రావు



పంచాయతీ భవన నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న ఎంపీపీ

పరిగి: గ్రామాల అభివృద్ధికి సీఎం కేసీఆర్ పెద్దపీట వేస్తున్నారని ఎంపీపీ అరవింద్‌రావు అన్నారు. బుధవారం మండల పరిధిలోని ఖుదావన్‌పూర్ గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న పంచాయతీ భవన నిర్మాణానికి ఆయన భూమి పూజ నిర్వహించారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ.. ప్రజలకు అన్ని సౌకర్యాలను కల్పించేందుకు ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందన్నారు. అన్ని వర్గాల సంక్షేమానికి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ శేషగిరిశర్మ, సర్పంచ్ గోపాల్, ఎంపీటీసీ సభ్యురాలు ఉమ, ఉప సర్పంచ్ లక్ష్మమ్మ గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

రేవంత్‌రెడ్డి సభను విజయవంతం చేయండి

కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గోపాల్



విలేకరుల సమావేశంలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు

పెద్దేముల్: తాండూరులో గురువారం పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి సభను విజవయంతం చేయాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గోపాల్ అన్నారు. బుధవారం ఆయన మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడుతూ.. పార్టీ కార్యకర్తలు, నాయకులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. వచ్చే ఎన్నికల్లో తాండూరు గడ్డపై కాంగ్రెస్ జెండా ఎగురవేయడం ఖాయమన్నారు.

ఎంఐఎం నూతన కమిటీ



అసదుద్దీన్ ఓవైసీతో నాయకులు

అనంతగిరి: ఎంఐఎం వికారాబాద్ పట్టణ అధ్యక్షుడిగా ఎండి.ఉస్మాన్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ మేరకు పార్టీ అధినేత ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ నియామక పత్రం అందజేశారు. పట్టణ కార్యదర్శిగా అలీముద్దీన్. జాయింట్ సెక్రెటరీలుగా అలీమ్, మహమ్మద్ అలీ, మీర్జా ఫెరోజ్ భేగ్, కోశాధికారిగా షరీఫ్, సభ్యులుగా మజార్, నసార్, మహీవుద్దీన్, శేర్‌ఖాన్, ఇబ్రహీం, ఇమ్రాన్, హనీఫ్‌ను నియమించారు. ఈ సందర్భంగా వారు పార్టీ అధినాయకత్వానికి ధన్యవాదాలు తెలిపారు.

పరామర్శ

బొంరాస్‌పేట: అనారోగ్యంతో బాధపడుతున్న రేగడిమైలారం మాజీ సర్పంచ్ నర్సిరెడ్డిని పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి బుధవారం రాత్రి పరామర్శించారు. ఆయన భార్య యాదమ్మను అడిగి ఆరోగ్య పరిస్థితి తెలుసుకున్నారు. పార్టీకి ఆయన చేసిన సేవలను నెమరేసుకున్నారు. ఆయన వెంట మండల అధ్యక్షుడు నర్సింలుగౌడ్, జయకృష్ణ, మల్లేశ్, గుండప్ప, పరమేశ్వర్ గోవింద్‌గౌడ్ తదితరులున్నారు.

మా భూములు మాకే..

భారత వజ్రోత్సవాల సందర్భంగా 30 వేల మొక్కలు నాటేందుకు ప్రభుత్వం ఆరు గ్రామాలను ఎంపిక చేసింది. ఇందుకు రెవెన్యూ అధికారులు అసైన్డ్ భూములను సేకరించడంతో పేదలు ఆందోళనకు గురవుతున్నారు. మా భూములు మాకే కావాలని, భూములను లాక్కోవద్దంటూ వేడుకుంటున్నారు. అవి లేకుంటే తమకు ఇక ఆత్మహత్యలే శరణ్యమని అంటున్నారు.

- ఇరవై ఏళ్లుగా కాస్తులో ఉన్నాం
- మొక్కలు నాటేందుకు అటవీశాఖ అధికారుల యత్నం
- న్యాయం చేయాలని మండల అధిరాలకు మొర



ఎంపీడీఓకు సమస్య వివరిస్తున్న గిరిజన రైతులు

పెద్దేముల్: ఇరువై ఏళ్లుగా పైగా కాస్తులో ఉన్నాం.. ఏటా పంటలు పండిస్తున్నాం... రైతు బంధు వస్తోంది.. దివగంత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి హయంలో పట్టా పుస్తకాలు ఇచ్చారు.. రెండేళ్లుగా అటవీశాఖ అధికారులు మా భూములు ఖాళీ చేయాలంటూ ఇబ్బంది పెడుతున్నారని బుధవారం గోట్లపల్లి గ్రామస్తులు మండల అధికారులకు తమ సమస్యను వివరించారు. భారత వజ్రోత్సవాల కార్యక్రమంలో భాగంగా మాస్ ప్లాంటేషన్ కోసం ఈ భూమిలో మొక్కలు నాటుతామని స్థల పరిశీలను రావడంతో రైతులు అధికారులను అడ్డుకున్నారు. మేము బతికేది.. సచ్చేది ఇదే భూమిల్లో అంటూ వాపోయారు. మండల పరిధిలోని మండల గోట్లపల్లి గ్రామంలో రైతు మ్యాతరి లక్ష్మికి సర్వేనెంబర్ 94–ఆ,లో 2.25గుంటల భూమిని వైఎస్సార్ హయంలో పట్టా పాసుబుక్ ఇచ్చారు.‘అదే గ్రామానికి చెందిన రైతు హరిజన్ బస్సమ్మకు సర్వే నెంబర్ 94–ఊ, 2.5గుంటల భూమికి (అసైండ్) పట్టా ఇచ్చారు. ఈ భూమిలో సుమారు 20 ఏళ్లకు పైగా రైతులు పంటలు సాగుతో జీవనం సాగిస్తున్నారు. తెలంగాణ ప్రభుత్వం నుంచి ప్రతీ సంవత్సరం రైతు బంధు అందుతోంది. సర్వే నెంబర్ 94లో భూమి అటవీ శాఖకు సంబంధించినది.. భూములను వదిలేయాలని రెండేళ్లుగా ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం బతుకు దెరువు కోసం ఇచ్చిన భూమిని అటవీశాఖ అధికారులు ఖాళీ చేయమనడం న్యాయం కాదంటూ వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ మేరకు బుధవారం పెద్దేముల్ ఎంపీడీఓ లక్ష్మప్ప, ఉపాధి హామీ, పంచాయతీ కార్యదర్శులు గోట్లపల్లిలో ఈ నెల 25న భారత వజ్రోత్సవాల సందర్భంగా మాస్ ప్లాంటేషన్ కోసం అటవీ భూమి పరిశీలనకు వెళ్లారు. ఈ సందర్భంగా రైతులు వారిని అడ్డుకుని భూమి పై దౌర్జన్యం చేస్తే తమకు ఆత్మహత్యలే శరణ్యమని రైతులు మ్యాతరి లక్ష్మి, హరిజన్ బస్సమ్మ, తాంద్ర సత్యమ్మ, నర్సింలు, నరేశ్ అధికారులతో వాపోయారు. స్పందించిన ఎంపీడీఓ లక్ష్మప్ప న్యాయం చేసేందుకు సహకరిస్తానన్నారు.

వైఎస్సార్ పట్టాలిచ్చారు



భూమి లేని గిరిజన రైతులకు 20 ఏళ్ల క్రితం దివంగత సీఎం వైఎస్సార్ రెండు ఎకరాల భూమి ఇచ్చారు. అప్పటి నుంచి పంటలు సాగుచేస్తున్నాం. ఈ ఏడాది పెసర పంట వేశాం. భారీ వర్షాల కారణంగా పెట్టుబడులు వచ్చే నమ్మకం లేదు. అప్పులు చేసి సాగుచేస్తుంటే అటవీశాఖ అధికారులు భూమి మాదంటున్నారు. ప్రభుత్వమే మాకు న్యాయం చేయాలి.

– మ్యాతరి లక్ష్మి, రైతు, గోట్లపల్లి

రక్షణ కల్పించండి



20 ఏళ్ల క్రితం అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం పేదలు వలస వెళ్లకుండా సర్వే నెంబర్ 94లో బతుకు దెరువు కోసం రెండు ఎకరాల అసైండ్ భూమి పంపిణీ చేసింది. దాని పక్కనే సర్వే నెంబర్ 54–అ1 విస విస్తీర్ణం 2.14 గుంటల పట్టా భూమి ఉంది. అటవీ శాఖ అధికారులు మా భూమి అంటున్నారు. ఇచ్చిన భూములు తీసుకుంటే వలస వెళ్లక తప్పదు. ప్రభుత్వం భూములకు రక్షణ కల్పించాలి.

– హరిజన్ బస్సమ్మ , రైతు, గోట్లపల్లి



ప్రొజెక్టర్ ద్వారా చంద్రయాన్‌-3 ల్యాండరింగ్‌ను వీక్షిస్తున్న విద్యార్థులు

చంద్రయాన్‌-3 విజయవంతం

దేశమంతా ఆసక్తిగా ఎదురు చూసిన చంద్రయాన్ విజయవంతమైంది. సాటిలేని ఈ విజయంతో ఇస్రో చరిత్ర సృష్టించింది. దీంతో జిల్లా వ్యాప్తంగా బుధవారం సంబురాలు అంబరాన్నంటాయి. ఈ విక్రమ్ ల్యాడింగ్ అపూర్వ ఘట్టాన్ని తిలకించేందుకు విద్యార్థులకు థియేటర్లకు వెళ్లారు. పలుచోట్ల నాయకులు భారీ ఎల్ఈడీ స్క్రీన్‌లు ఏర్పాటు చేశారు. విద్యార్థులు జాతీయ జెండాలు పట్టుకుని విజయ సంకేతం చూపారు.

– సాక్షి నెట్‌వర్క్



థియేటర్‌కు వెళ్తున్న, మర్పల్లి జూనియర్ కళాశాల విద్యార్థులు

ఆరు గ్రామాల్లో 30వేల మొక్కలు



గోట్లపల్లిలో మొక్కలు నాటేందుకు స్థల పరిశీలన చేస్తున్న ఎంపీడీఓ, సిబ్బంది

అటవీ ప్రాంతాన్ని పరిశీలించిన అధికారులు

పెద్దేముల్: భారత వజ్రోత్సవాల సందర్భంగా మండల పరిధిలోని ఆరు పంచాయతీల్లో మొక్కలను నాటేందుకు ప్రభుత్వం నిర్ణయించిందని ఎంపీడీఓ లక్ష్మప్ప అన్నారు. బుధవారం మండల పరిధిలోని గోట్లపల్లిలో మొక్కలు నాటేందుకు అటవీప్రాంతాన్ని పరిశీలించారు. ఈ నెల 26న అన్ని పంచాయతీల్లో 30 వేల మొక్కలు నాటుతామన్నారు. గోట్లపల్లి, రుక్మాపూర్ గ్రామాల్లో 3వేల చొప్పున, రుద్రారం, నాగులపల్లి, పాషాపూర్, రెంగోడి పంచాయతీల్లో ఆరువేల చొప్పున మొత్తం 30వేల మొక్కలు నాటుతామన్నారు. ఇందుకు ఆయా గ్రామల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, మండల, అటవీ శాఖ , వివిధ శాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బంది సహకరించాలన్నారు. నాటిన ప్రతీ మొక్కను సరంక్షించాలన్నారు. ఆయన వెంట సర్పంచ్ పద్మమ్మ, బీఆర్ఎస్‌నాయకులు చంద్రశేఖర్, ఉపాధి హామీ టెక్నికల్ అసిస్టెంట్ ఆంజనేయులు, పంచాయతీ కార్యదర్శులు రాజు, మల్లిఖార్జున్, ఫీల్డ్ అసిస్టెంట్ అబ్రహం, రాంచెందర్ ఉన్నారు.

ఆర్పీఎఫ్ దళాల కవాతు



వికారాబాద్ పీఎస్‌లో ఆర్పీఎఫ్ దళాలు

అనంతగిరి: పట్టణంలో బుధవారం ఆర్పీఎఫ్ దళాలు కవాతు నిర్వహించాయి. ఈ సందర్భంగా పట్టణంలోని ఆయా ప్రధాన వీధుల మీదుగా కవాతు కొనసాగింది. ఈ కార్యక్రమంలో వికారాబాద్ డీఎస్పీ నర్సింలు, సీఐ శ్రీను, ఆర్పీఎఫ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

గడువులోగా టార్గెట్ పూర్తి చేస్తాం

ఏపీఓ అంజిరెడ్డి



పెద్దాపూర్ నర్సరీ నుంచి మొక్కలు తీసుకెళ్తున్న ఉపాధి సిబ్బంది

మర్పల్లి: ప్రభుత్వం ఇచ్చిన టార్గెట్ ప్రకారం ఈ నెల 26 వరకు మొక్కలు నాటే కార్యక్రమం పూర్తి చేస్తామని మర్పల్లి ఏపీఓ అంజిరెడ్డి అన్నారు. బుధవారం మండల పరిధిలోని పెద్దాపూర్ నుంచి మోమిన్‌పేట్ మండలం క్యాసారం సరిహద్దు ఆర్ అండ్ డీ రోడ్డు పక్కన బుధవారం ఉపాధి కూలీలు మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఏపీఓ మాట్లాడుతూ.. కలెక్టర్, డీఆర్‌డీఓ ఆదేశాల మేరకు ఈ ఏడాది 30వేల మొక్కలు నాటామన్నారు. ఈ కార్యక్రమంలో పెద్దాపూర్ సర్పంచ్ ఉమ, రావులపల్లి సర్పంచ్ దేవమ్మ, ఆయా పంచాయతీల కార్యదర్శులు, టీఏలు విష్ణువర్ధన్‌రెడ్డి, భాస్కర్, ఎఫ్ఏలు, ఉపాధి కూలీలున్నారు.

రైతులు సస్యరక్షణ చర్యలు పాటించాలి



పంటలను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి గీతారెడ్డి

శంకర్‌పల్లి: రైతులు సస్యరక్షణ చేపట్టి పంటలను రక్షించుకోవచ్చని జిల్లా వ్యవసాయాధికారి గీతారెడ్డి పేర్కొన్నారు. పర్వేద గ్రామంలో బుధవారం వరి, మొక్కజొన్న, పత్తి పంటలను ఆమె పరిశీలించారు. రైతులకు సస్యరక్షణపై పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వరి పంటలో పిలకలు లేదా దుబ్బు చేసే దశలో కాండం తొలుచు పురుగును గమనించి నివారణ కోసం మందులను పిచికారీ చేయాలని సూచించారు. పత్తి పంటలో పురుగుల ఉధృతి ఉంటే ఎకరాకు 5లీటర్ల వేప మందును పిచికారీ చేయాలని తెలిపారు. మొక్కజొన్నలో కత్తెర పురుగుల నివారణ కోసం వ్యవసాయ అధికారుల సూచనలు పాటించాలన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి సురేష్‌బాబు, ఏఈఓ పాల్గొన్నారు.

‘పట్నం’ గెలుపునకు ప్రత్యేక ప్రార్థనలు



ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న వాణిశ్రీ దంపతులు

కొడంగల్ రూరల్: వచ్చే ఎన్నికల్లో కొడంగల్ నుంచి రెండోసారి పట్నం నరేందర్‌రెడ్డి గెలవాలని మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ వాణిశ్రీ, మధుసూదన్‌యాదవ్ దంపతులు బుధవారం కడప జిల్లాలోని పెద్ద అమీర్ పీర్ దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ ప్రార్థనలకు పట్టణంలోని పలువురు గాంధీనగర్ కాలనీవాసులతో కలిసి వెళ్లారు.

రైతులకు న్యాయం చేయాలి

బీజేపీ అధ్యక్షుడు కిషన్‌రెడ్డికి బాధితుల వినతి



కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి వినతి పత్రం అందిస్తున్న బాధిత రైతులు

చేవెళ్ల: దామరగిద్ద సమీపంలో చేవెళ్ల బస్‌డిపో ఏర్పాటుకోసం భూములు కోల్పోయిన రైతులకు న్యాయం చేయాలని బాధిత రైతులు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి జి కిషన్‌రెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. చేవెళ్ల మండలకేంద్రంలో బుధవారం జరిగిన బీజేపీ సమావేశానికి వచ్చిన కేంద్ర మంత్రి, రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డిని దామరగిద్దలో బస్‌స్టేషన్ ఏర్పాటు కోసం భూములు కోల్పోయిన బాధిత రైతులు కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బస్‌డిపో ఏర్పాటు చేస్తామని తమ భూములను ప్రభుత్వం తీసుకొని ఆర్టీసీకి అప్పగించిందన్నారు. అప్పుడు భూములు ఇచ్చినందుకు ఇంటికో ఉద్యోగం ఇస్తామన్న విషయాన్ని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి దృష్టికి తెచ్చారు. ప్రస్తుతం ఇక్కడ బస్ డిపో రాలేదు. వస్తుందో రాదో కూడా తెలియని పరిస్థితి నెలకొందన్నారు. తాము డిపో ఏర్పాటునకు ఇచ్చిన భూములను తిరిగి ఇప్పించాలని బాధిత రైతులు మంత్రితో వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు పాండురంగారెడ్డి, పరిగి నాయకులు పరమేశ్వర్‌రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి అత్తెల్లి అనంత్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఉమాశంకర్‌కు మంచి భవిష్యత్

వికారాబాద్ జెడ్పీటీసీ ప్రమోదినిరెడ్డి



ఉమాశంకర్‌కు శుభాకంక్షాలు తెలుపుతున్న ప్రమోదినిరెడ్డి, తదితరులు

తాండూరు రూరల్: మండల పరిధిలోని చంద్రవంచ గ్రామానికి చెందిన యువ నాయకుడు పటేల్ ఉమాశంకర్‌కు మంచి భవిష్యత్ ఉందని తాండూరు ఎమ్మెల్యే తల్లి, వికారాబాద్ జెడ్పీటీసీ సభ్యురాలు ప్రమోదినిరెడ్డి అన్నారు. బుధవారం ఉమాశంకర్ జన్మదినం సందర్భంగా పట్టణంలోని ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన వేడుకలకు ఆమె హాజరై ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీల ఫోరం జిల్లా అధ్యక్షుడు నరేందర్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థులు చదువులో రాణించాలి



నగదుతో పాటు ప్రశంసా పత్రాలు అందజేస్తున్న గోకుల్‌దాస్‌లే, సర్పంచ్ సమ్మి పెంటయ్య

బయోస్టేడ్ కంపెనీ వైస్ ప్రెసిడెంట్ గోకుల్‌దాస్‌లే, సర్పంచ్ సమ్మి పెంటయ్య

షాబాద్: విద్యార్థులు కష్టపడి చదివి రాణించాలని బయోస్టేడ్ కంపెనీ వైస్ ప్రెసిడెంట్ గోకుల్‌దాస్‌లే, తాళ్లపల్లి సర్పంచ్ సమ్మి పెంటయ్య పేర్కొన్నారు. బుధవారం తాళ్లపల్లి ఉన్నత పాఠశాలలో పదోతరగతి విద్యార్థులకు బయోస్టేడ్ కంపెనీ వారు ఒక్కొక్కరికి రూ.2,500ల చొప్పున 10 మందికి అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు ఇష్టపడి చదివి మంచి ప్రమోజకులవ్వాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో నిరుపేద విద్యార్థులను ప్రోత్సహించడం సంతోషకరమన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ బలోపేతానికి కృషి

ఎస్సీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు షాబాద్ దర్శన్



మల్లేశ్‌కు నియామకపత్రం అందజేస్తున్న షాబాద్ దర్శన్

మొయినాబాద్: గ్రామస్థాయి నుంచి కాంగ్రెస్‌ను బలోపేతం చేసేందుకు ప్రతీ కార్యకర్త కృషి చేయాలని ఎస్సీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు షాబాద్ దర్శన్ పేర్కొన్నారు. ఎలుకగూడ, కుత్బుద్దీన్‌గూడ గ్రామ కమిటీ అధ్యక్షుల నియామకం బుధవారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉందన్నారు. ఈ సారి కాంగ్రెస్‌ను గెలిపించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని ఆశాభావం వ్యక్తం చేశారు. పార్టీ నాయకులు, కార్యకర్తలందరూ ప్రజల్లో ఉండి కేసీఆర్ ప్రభుత్వం చేస్తున్న మోసాలను ప్రతీ ఇంటికీ తిరిగి ప్రజలకు వివరించాలన్నారు. అనంతరం ఎలుకగూడ, కుత్బుద్దీన్‌గూడ గ్రామ కమిటీ అధ్యక్షులు కుండె మల్లేశ్, ఎ.జంగయ్య, ఎండీ మినాజుద్దీన్‌లతో కమిటీ సభ్యులను నియమించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు మాణయ్య, యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నిరంజన్‌గౌడ్, సీనియర్ నాయకుడు రాములు, తదితరులు పాల్గొన్నారు.

ఓటరులిస్టులో అభ్యంతరాలుంటే సరిచేసుకోవచ్చు



పెద్దేముల్: బీఎల్ఓలతో మాట్లాడుతున్న తహసీల్దార్ కిషన్

తహసీల్దార్ కిషన్

పెద్దేముల్: నూతన ఓటర్లు, ఓటరు లిస్టులో అభ్యంతరాలుంటే సరిచేసుకోవచ్చని పెద్దేముల్ తహసీల్దార్ కిషన్ అన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, అంగన్‌వాడీ, బీఎల్ఓలకు, టీచర్‌లకు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సెప్టెంబర్ 19వరకు ఓటరు లిస్టుల ప్రక్రియ పూర్తి కావాలన్నారు. అభ్యంతరాలుంటే సరిచేసుకోవాలని సూచించారు. 18ఏళ్లు నిండిన వారు కొత్తగా ఓటు నమోదు చేసుకోవాలని, తప్పొప్పులు, జనన మరణం త్వరలో పూర్తి చేయాలని బీఎల్ఓలకు సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ మహేశ్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ (ఆర్ఐ) రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



బొంరాస్‌పేట: హాజరైన బూత్ స్థాయి సిబ్బంది

ఓటరు నమోదు ముమ్మరం చేయాలి

బొంరాస్‌పేట: అర్హులైన ప్రతీ ఒక్కరిని ఓటరుగా నమోదు చేయించాలని తహసీల్దార్ వెంకటేశ్ సూచించారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో బూత్‌స్థాయి అవగాహన సదస్సు నిర్వహించారు. ఇందులో అంగన్‌వాడీ కార్యకర్తలకు, రెవెన్యూ సిబ్బంది తదితర సిబ్బందికి ఓటుహక్కు కోసం పేర్లు నమోదు చేసుకునేందుకు అర్హులను గుర్తించి అవగాహన కల్పించాలన్నారు. అక్టోబర్ 2 నాటికి వయోజనులకు ఓటుహక్కు కల్పించలన్నారు.

26, 27న స్పెషల్ డ్రైవ్



కొడంగల్ రూరల్: బీఎల్ఓలతో సమావేశమైన తహసీల్దార్ విజయకుమార్

కొడంగల్ రూరల్: 18ఏళ్లు నిండిన యువతకు ప్రత్యేక కార్యక్రమాలతో అవగాహన కల్పిస్తూ ప్రతీ ఒక్కరిని ఓటరుగా నమోదు చేయించాలని తహసీల్దార్ బి.విజయకుమార్ సూచించారు. బుధవారం పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో బూత్ లెవల్ అధికారులతో సమావేశం నిర్వహిస్తూ పలు సూచనలు అందించారు. అక్టోబర్ 1వ తేదీ నాటికి 18ఏళ్లు నిండిన యువత ఓటరుగా నమోదు చేసుకోవాలని, ఈ నెల 26, 27వ తేదీలలో స్పెషల్ డ్రైవ్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్లు సురేశ్‌కుమార్, శివకుమార్, బీఎల్ఓలు పాల్గొన్నారు.

కొత్త ఓటర్లకు అవగాహన కల్పించండి

కుల్కచర్ల: 18 ఏళ్ల నిండిండిన ప్రతీ ఒక్కరు ఓటు హక్కు నమోదు చేసుకునేందుకు అవగాహన కల్పించాలని బీఎల్ఓలకు తహసీల్దార్ మురళీధర్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ రమేశ్‌కుమార్, ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, అంగన్‌వాడీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.